



విదేశస్తుల సంగతి నా కొట్టే తెలియదు గాని, మన దేశస్తుల్లో మాత్రం శకు

నాలమీదా, గ్రహబలాలమీదా, అదృష్ట దురదృష్టాలమీదా నమ్మకాలున్నవాళ్ళు

కొల్లలు. వీటిమీద నాకేమీ నమ్మకం లేకపోయినా నేను పెరిగింది మాత్రం అలాంటి నమ్మకాలున్న వాళ్ల మధ్యనే. నా చిన్నప్పటి విషయాలైనా నాకు బాగానే గుర్తు. మా నాన్న శుక్రవారంనాడు చస్తే కానీ ఖర్చు పెట్టేవాడు కాదు ఎంత అత్యవసరమైనా సరే. శుక్రవారం డబ్బు ఖర్చు చేస్తే లక్ష్మీదేవి అనుగ్రహం తప్పిపోతుందిరా, దరిద్రం చుట్టుకుంటుందిరా అనేవాడు. (ఏమాట కామాటే చెప్పుకోవాలి. నేను చిన్నప్పట్నుంచీ దరిద్రంలోనే పెరిగాను. నా చాలామంది క్లాస్‌మేట్స్‌కు లాగా నాకు సిల్కు చొక్కాలూ, లాగులూ ఉండేవికావు. స్కూల్లో చదువుతుండగా వారానికో ఐస్ ఫ్రూటన్నా కొనుక్కుని ఎరగను. కాలేజీ చదువంతా అతి కష్టంగా స్కాలర్‌షిప్‌ల సహాయంతోనే సాగించాను. మా నాన్న చనిపోయినప్పుడు దిన వారాలే సరిగా జరిపించుకోలేకపోయాను. ఎటు తిరిగీ ఈ ఉద్యోగంలో చేరి 'పై సంపాదన' కూడా సంపాదిస్తున్నప్పట్నుంచే సూట్లూ, సోఫాలూ, విస్కీలూ అనుభవంలో కొచ్చాయి.)

ఆదివారంనాడు బయటి ఊళ్ళకు ప్రయాణం కావటానికి మా అమ్మ ఒప్పుకునేదికాదు. బయలుదేరితే శనివారమో, సోమవారమో బయలుదేరమనేది. వర్జ్యం, దుర్ముహూర్తం లేకుండా మంచి సమయం ఏదో సిద్ధాంతిగార్ని కనుక్కుని వచ్చి, పక్కింటి ముత్తయిదువును ఎదురుగా రమ్మని అప్పటికిగాని బయలుదేర విచ్చేది గాదు. అయితేనేం ఇంటర్వ్యూలకు బయలుదేరిన ప్రతిసారీ ఇంత తతంగమూ చేస్తున్నా డిగ్రీ సంపాయించిన రెండు సంవత్సరాలకిగాని ఉద్యోగంరాలేదు. ఆ ఇంటర్వ్యూకి ఎలా బయలుదేరానో సరిగా గుర్తు లేదు. సిద్ధాంతిగారి దగ్గరికి వెళ్ళి మంచి సమయం తెలుసుకురావటానికి మా అమ్మ ఊళ్లో లేదు. అంతకు నాలుగు రోజుల క్రితమే మా మామయ్యగారి ఊరికి వెళ్లింది. నే నే ముత్తయిదువునూ ఎదురుగా రమ్మని అడగలేదు. ఎవరెదురొచ్చారో గుర్తులేదు. అయితే నేం ఈ ఉద్యోగం వచ్చింది.

మా మామయ్యకు కొన్ని నమ్మకాలుండేవి. వాటిలో ఒకటి నాకు బాగా గుర్తున్నది. ఏవిటంటే ఏ జబ్బయినా ఎక్కువ మోతాదులో మందు తీసుకుంటే త్వరగా నయమవుతుందని. అరంగుళం మేర తెగితే ఆరంగుళాల మేర టించరు పూసి కట్టు కట్టమని డాక్టరుగారిని వేధించేవాడు, త్వరగా నయమవుతుందనే నమ్మకంతో. ఒకసారి డాక్టరుగారికి తెలియకుండా టించరు విపరీతంగా పోసి గాయానికి కట్టు కట్టుకున్నాడు స్వయంగా. గాయంచుట్టూ ఉన్న కండరాలన్నీ దెబ్బతిని చీకిపోయి యమబాధ పడ్డాడు. తర్వాత ఆయన నమ్మకం గూర్చి తెలుసుకుని డాక్టరుగారు చీవాట్లు పెట్టారు.




బి. ఇ. లో మా క్లాస్‌మేట్ ఒకడికి ఇలాంటి నమ్మకాలు కొన్ని ఉండేవి. ఒక సంవత్సరం ఎగ్జామినేషన్స్‌లో మొదటి రోజున ఎగ్జామినేషన్ హాలుకు వెళ్ళుతుండగా దారిలో కుడికాలు బొటనవ్రేలికి ఎదురుదెబ్బ తగిలింది. ఆ రోజు వాడు పరీక్ష బ్రహ్మాండంగా వ్రాశాడు. అందుకని ప్రతిరోజూ ఆ వ్రేలికి అదేరాతిదగ్గర (మెల్లగా) ఎదురుదెబ్బ తగిలించుకుని వెళ్ళేవాడు. (వాడా సంవత్సరం పరీక్షలెలా ప్యాసయ్యాడని మీకు క్యూరియస్‌గా వుంది కదూ? వాడికి ఎగ్రిగేట్ పోయింది.)

ఇంతవరకూ ఈ నమ్మకాల గురించి నా కెప్పుడూ సీరియస్‌గా ఆలోచించవలసిన అగత్యం కలగలేదు. పది రోజుల క్రితం హఠాత్తుగా సుందరం కన్పించాడు. వాడి స్థితి చూచి, వాడి మాటలు విన్నాక ఆ అగత్యం కలిగినట్లనిపించింది.

ఆ రోజు సాయంత్రం ఆఫీస్ నుంచి ఇంటికి వస్తున్నాను. దారిలో హఠాత్తుగా ఒకవ్యక్తి తూలి నా స్కూటర్ క్రింద పడబోయాడు. సడన్ బ్రేక్‌వేసి స్కూటర్ ఆపుచేశాను. మితిమీరిన కోపంతో ఆ వ్యక్తిని చీవాట్లు పెట్టబోయిన వాడిని, అతని మొహంలోకి చూసి ఆగిపోయాను. వాడే బి ఇ.లో నా క్లాస్‌మేట్ సుందరం.

అప్పటి సుందరం అవతారం చూసి చాలా ఆశ్చర్యపోయాను. వాడు స్నానం, భోజనం చేసి కనీసం నాలుగు రోజులై ఉంటుంది. తప్పకుండా ఏదో అఘాయిత్యం చేసి ఇంట్లోంచి పారిపోయి వచ్చి ఉండాలనుకున్నాను. వాడూ నన్ను గుర్తుపట్టి ఏదో మాట్లాడబోయాడు. అప్పుడు వాడితో బజారులో ఏం మాట్లాడాలో నాకేం తోచలేదు. సర్లే, తర్వాత మాట్లాడుకుందాంలే ముందు స్కూటరెక్కు అని వాడిని ఇంటికి తీసుకుపోయాను.

"నీకు తెలియదురా! ముహూర్త బలాల్నీ, గ్రహప్రభావాల్నీ అంత తేలిగ్గా కొట్టి పారెయ్యకూడదు. నేను పుట్టడమే దుర్ముహూర్తంలో పుట్టాను. అందుకనే జీవితంలో నా కెప్పుడూ దురదృష్టమే ఎదురయ్యింది.

నేనేం మాట్లాడలేదు. మౌనంగా వాడు చెప్పేది వింటూ సిగరెట్ కాలుస్తూ కూర్చున్నాను.

"నేను పుట్టినప్పుడే మా సిద్ధాంతి చక్రం వేసి నా జాతకం చూశాడు. నేను దుర్ముహూర్తంలో పుట్టానని నిర్ధారణ చేశాడు. దుష్ట గ్రహశాంతికి పూజలు చేశాడు.


ఆ సంవత్సరమే చాలా ఘోరమైన అగ్ని ప్రమాదం జరిగి మావూరు మొత్తం కాలిపోయింది. మా యిల్లు, ధాన్యం— అన్నీ కాలిపోయాయి.

ఆ దెబ్బనుంచి మా కుటుంబం కోలుకునేసరికి మూడు సంవత్సరాలు పట్టింది. ఇంతలో మరో దెబ్బ. మా ప్రాంత మంతటా చెరువుల క్రిందనే వ్యవసాయం. వరుసగా రెండు సంవత్సరాలు వర్షాలు లేక చెరువులు నిండక మాకు పంటలు పోయాయి. కరువుకు తట్టుకో లేక మా వూరినుంచి కొన్ని కుటుంబాలు తమ ఆస్థిపాస్థులన్నీ అయినకాడికి తెగ నమ్ముకుని బోధన్, కడెం ప్రాజెక్టు మొదలయిన ప్రాంతాలకి వెళ్ళిపోయారు. మా బాబాయి లిద్దరు కూడా అలాగే వెళ్ళిపోయారు. మా నాన్నను కూడా రమ్మని బలవంతపెట్టారు. కాని మా నాన్న ఒప్పుకోలేదు. ఏదో కష్టం వచ్చిందని పుట్టిపెరిగిన ఊరిని వదిలిపెట్టి పోవటం ఎంత హీనం? కష్టమో, సుఖమో, మంచో, చెడో, కలో, గంజో త్రాగుతూ ఉంటాను కాని ఊరు వదలి పెట్టనన్నాడు మానాన్న.

ఈ విషయం ఎందుకింత ప్రత్యేకంగా చెపుతున్నానంటే నా గ్రహబలానికీ దానికీ సంబంధ ముండబట్టే. మేము రాను రాను చితికిపోయాము కాని మా బాబాయిలంతా బాగుపడ్డారు. కొత్తగా కట్టిన ప్రాజెక్టుల క్రింద చవగ్గా, పొలాలు కొని వ్యవసాయం చేసి బాగా సంపాదించారు. మా నాన్న ఊరు వదిలిపెట్టక పోవటానికి కారణం నా గ్రహబలం కాక మరేమి టంటావ్?

నేను మా ప్రక్క వూరి హైస్కూల్లో చదువుకుంటూ స్కూల్ ఫైనల్ కంత టికీ ఫస్టున ప్యాసయ్యాను. తర్వాత పీ. యూ. సీ. లోనూ క్లాస్ తెచ్చుకున్నాను.

నేను పీ. యూ. సీ. పరీక్షలు రాస్తున్నప్పుడే మా నాన్న చచ్చి పోయాడు. చీకటి పడ్డాక పొలంనుంచి తిరిగి వస్తుండగా మా వూరి తుమ్మల డొంకలోంచి వస్తున్నప్పుడు పాము కరిచింది. మంత్రం వేయించినా బ్రతకలేదు. దుష్ట ఘడియల్లో




నల్ల త్రాచు కరిచింది. నేను పరీక్షలు మధ్యలో మానేసి వస్తానేమోనని నాకు తెలియపర్చలేదు.

నేను పీ. యూ. సీ చదువుతున్న సమయంలో ఇంజినీరింగ్‌కి మంచి ప్రాస్పెక్ట్స్ ఉన్నాయి. బి. ఇ. లో సీట్ వస్తే ఉద్యోగం ఖాయం. అప్పటి పరిస్థితి నీకు తెలుసుగా.

బి. ఇ. లో చేరాను. నా దురదృష్టం నన్నెప్పుడూ వెంబడిస్తూనే ఉందని నా కనుమానంగానే ఉంది చాలా సంఘటనల్లో అది రుజువయింది కూడా.

బి. ఇ. లో మెకానికల్ బ్రాంచికి అప్పుడు కాంపిటీషన్ ఎక్కువ. బి. ఇ. పూర్తికాగానే మంచి ఉద్యోగం గ్యారంటీగా దొరుకుతుండేవి. నీ వెరుగుదువుగా. మొదటి రెండేళ్లూ బాగా కష్టపడి చదివి మెకానికల్ బ్రాంచి తెచ్చుకున్నాను. ఆ రోజున నా అంత అదృష్టవంతుడు లేడని మురిసిపోయాను. కాని చివరికి అదే దురదృష్టంగా పరిణమిస్తుందని తెలుసుకోలేక పోయాను.

థర్డియర్‌లో మన హాస్టల్ మెంబర్లందరం సీలేరు పిక్నిక్‌కి వెళ్లాం గుర్తుంది గదూ. వెళ్లేటప్పుడు నే నెక్కిన బస్సు టైర్ పంక్చరయింది.

తిరిగి వచ్చేటప్పుడు మరో బస్సు ఎక్కాను. దారిలో దానికే యాక్సిడెంట్ కొద్దిలో తప్పిపోయింది. కొంచెంలో అది పెద్ద లోయలో పడి పోవలసింది. నాలుగు గంటలు ఆలస్యంగా హాస్టల్స్‌కు చేరాము. నీకు గుర్తుండే ఉంటుంది.

ఇలాంటి సంఘటనలు కొల్లలుగా ఎదురయ్యేవి నాకు.

బి. ఇ. పూర్తి చేసేసరికి పరిస్థితులన్నీ మారిపోయాయి. ఇంజినీర్లకు

ఉద్యోగాలు దొరకటం లేదు. అందులో మెకానికల్స్‌కు అసలే దొరకటం లేదు. ఉద్యోగం కోసం చాలా ప్రయత్నించాను కాని ప్రతిచోటా దురదృష్టమే ఎదురయింది నాకు. నా దురదృష్టానికి ఒక ఉదాహరణ చెబుతాను.


ఒక పెద్ద ఫర్మ్‌లో నేనూ, మన క్లాస్‌మేట్స్ మరి నలుగురమూ "ట్రెయినీ" లుగా చేరాం. కొంత కాలమయిన తర్వాత నైనా ఉద్యోగ మిస్తారనే ఆశతో. ఏడు నెలలయినా వాళ్లు ఉద్యోగ మివ్వలేదు. ఇంకను విసుగెత్తి నేను మానేశాను. మరో నెల రోజులకు మిగిలిన మనక్లాస్‌మేట్స్ నలుగురికీ ఉద్యోగా లిచ్చారు వాళ్లు. అది తెలియగానే నే వెళ్ళి జనరల్ మానేజరును ఎంతగానో బ్రతిమాలు కున్నాను. అయినా లాభం లేక పోయింది. నా గ్రహబలం అలా ఉంటే నా కెందుకు ఉద్యోగం దొరుకుతుంది. ఉద్యోగం కోసం నే నెంత ప్రయత్నించానో, ఎన్ని కష్టాలు పడ్డానో నీకు తెలియదు."

ఉద్యోగం కోసం ఎన్ని కష్టాలు పడాలో రెండు సంవత్సరాలపైగా నానా యాతనలూ పడ్డ నాకుతెలుసు. కాబట్టి వాడెంత హైరాన పడ్డాడో తేలికగానే ఊహించగలను. వాడి కంఠంలో ధ్వనించిన నైరాశ్యానికి నేను చలించి పోయాను.

"ఇంటిదగ్గర పరిస్థితులు దుర్భరంగా తయారయాయి. ఇంటిదగ్గరుండలేక కవిపించిన ట్రెయినెక్కేశాను. ఇక్కడి వరకూ ఎవరూ నన్ను టిక్కెట్ అడుగలేదు. ఇక్కడ ఒక టి. టి. ఇ. చూసి— ఎందుకనో పోలీసులకు వప్పగించకుండా, దింపి స్టేషన్ బయటకు పంపించాడు.

నే నెక్కడుంటే అక్కడే అరిష్టాలు కలుగు తున్నాయి. ఇది నిజం. ఒకమాట చెపితే ఏమనుకోవుకదూ? నే నిప్పుడు నీ ఆశ్రయంలో ఉన్నాను నా ఉనికివల్ల నీకే మైనా అరిష్టం సంభవిస్తుందేమో నన్న అనుమానం నా మనసులో ఉంది."

వాడి మాటలకు ఉలిక్కిపడి వాడి మొహంలోకి చూశాను. వాడు తలదించుకున్నాడు ఆ మాటలతో వాడెంత దిగజారిపోయిందీ ఊహించాను. ఇంటి దగ్గర ఏదో సంఘటనను పురస్కరించుకుని అనాలోచితంగా బయలుదేరి వచ్చేశాడని అనుకున్నాను. ఆ సంఘటన ఏమిటో అడగ బుద్ధికాలేదు. అప్పటికి వాడికి ధైర్యం చెప్పే ఉద్దేశంతో "ఛః అలాంటి వెధవ నమ్మకాలన్నీ పెట్టుకోకు. ఉద్యోగం దొరక్కపోయినంత మాత్రానా, ఏవో నాలుగు సంఘటనలు మనకు అనుకూలంగా జరగక పోయినంత మాత్రాన అంతగా దిగులు పడతావేమిటోయ్? మన ముందు బ్యాచీలవాళ్ళకే చాలా మందికి ఇంతవరకూ ఉద్యోగాలు దొరకలేదు, దానికే మంటావ్? నాకు తెలిసిన ఒకాయన వాళ్ళ ఫర్మ్‌లో ఒక ఉద్యోగం




ఖాళీగా వుందన్నాడు పది రోజుల క్రిందట ఎక్కడో ఒకచోట ఉద్యోగం దొరుకుతుందిలే భయపడకు. అనవసరమైన ఆలోచనలతో మనస్సు పాడుచేసుకోకు'' అని ఓదార్చాను వాణ్ణి.

*          *

ఎలాగైనా సుందరానికో ఉద్యోగం సంపాదించాలని నిశ్చయించుకున్నా నా రాత్రి.

మర్నాడు మా ఆఫీసుకు వెళ్ళగానే నేనెరిగినాయనకు ఫోన్ చేశాను.

ఆయన కొంచెం ఇబ్బందిగా ''సారీ డియర్ ఫ్రెండ్! జస్ట్ రెండురోజుల క్రితమే ఆ ఉద్యోగంలో జేరవలసిందిగా ఒకతనికి అప్పాయింట్‌మెంట్ ఆర్డర్స్ పంపించాం. రెండు రోజులక్రితం చెప్పినట్లయితే తప్పకుండా మీ క్యాండిడేట్‌కే ఇచ్చేవాళ్ళం, సారీ! మరెక్కడైనా ట్రై చెయ్యండి, విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!'' అని ఫోన్ పెట్టేశాడు.

ఈ మాటలు వినగానే నేను చెప్పలేదూ అన్నట్లు విషాదంగా చిరునవ్వు నవ్వాడు

సుందరం. అయినా నేనేం నిరాశపడలేదు. నా ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నాను.

* *

ఆ రోజు సాయంత్రం ఆఫీసు వదలి ఇంటికి వెళ్ళబోయేముందు నాకు హఠాత్తుగా జనరల్ హాస్పిటల్ నుంచి ఫోన్ వచ్చింది. "మీ భార్య ఆపరేషన్ థియేటర్‌లో ఉంది. ఆపరేషన్ జరుగుతోంది. మీరు వెంటనే రండి" అని మరింకేం వివరాలు చెప్పలేదు. ఆపరేషన్ అనగానే నా శరీరం వణికిపోయింది. ప్రొద్దున కులాసాగా ఉన్న మనిషి సాయంత్రం ఆపరేషన్ ఏమిటి? ఏదైనా యాక్సిడెంట్—ఏ కారు క్రింద పడటంలాంటిది జరిగిందా? నాకు ముచ్చెమటలు పోశాయి. సుందరాన్ని ఇంటికి వెళ్ళమని చెప్పి నేను వెంటనే ఆస్పత్రికి పరుగెత్తాను

ఆ రోజు నేను ఆఫీసుకు వెళ్ళిన దగ్గర్నుంచీ కడుపులో నొప్పివచ్చి, మామూలు మందులకు తగ్గక సాయంత్రానికి భరించలేనంత విపరీతంగా పెరిగిపోవటంతో పొరుగువాళ్ళు ఆస్పత్రికి తీసుకు వచ్చారట. అక్కడ డాక్టర్లు పరీక్ష చేసి అపెండిసైటిస్ అని తేల్చి అర్జెంట్‌గా ఆపరేషన్ చేయాలని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకుపోయారట. వాళ్లు ఫోన్ చేసినప్పుడు ఆ కంగారులో నాకు పూర్తి వివరాలు చెప్పనే లేదు. అదివరకు రెండు మూడుసార్లు స్వల్పంగా కడుపులో నొప్పి వచ్చినా తగ్గిపోవటంతో ఎవ్వరం లెక్కచెయ్యలేదు. చివరికిదవి తేలిందన్నమాట.

ఆపరేషన్ సక్సెస్‌ఫుల్‌గా జరిగింది. "ఆపరేషన్ సకాలంలో జరిగింది. మరో గంట ఆలస్యమైతే ఏం జరిగేదో! మీరు చాలా అదృష్టవంతులు" అన్నారు డాక్టర్లు సంతోషంగా. ఆ రాత్రంతా అక్కడే ఉండి, తెల్లవారిన తర్వాత సంతోషంగా ఇంటికి బయలుదేరాను.

* *

నేను ఇల్లు చేరేసరికి ఇంట్లో సుందరం లేడు. ఒక ఉత్తరం మాత్రం ఉంది. ఆత్రుతగా ఉత్తరం చదివాను.

"డియర్ ఫ్రెండ్!

నీ ఆతిథ్యానికి నా కృతజ్ఞతలు. నేనెక్కడుంటే అక్కడ వారికి ఆపదలు సంభవిస్తున్నాయన్న విషయం మరోసారి రుజువైంది. నే నిక్కడుంటే ఏదైనా దుర్వార్త వినవలసిరావచ్చు. అది నేను భరించలేను. నీ భార్యకేమీ ప్రమాదం జరక్కూడదని భగవంతుణ్ణి ప్రార్థిస్తునాన్నాను.

నే నేమైపోయానో తెలుసుకోవటం కోసం ప్రయత్నించకు. మరెవ్వరికీ నా ఉనికితో ప్రమాదాలు తెచ్చి పెట్టటం నా కిష్టంలేదు. శెలవు.

సుందరం."